



సీసీ కెమెరాలను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీపీ సుధీర్‌బాబు



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

జ్యోతిబా పూలే ఆదర్శప్రాయుడు

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, స్త్రీ విద్య కోసం పాటుపడిన జ్యోతిబా పూలే ఆదర్శప్రాయుడని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టర్ పూలే చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ పూలే గొప్ప సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి అన్నారు. సామాజిక కార్యకర్త, మేధావి, కులాలకు అతీతంగా బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీబీసీడీవో ఉపేందర్, డీఎస్సీడబ్ల్యూవో మల్లేశం, సీపీవో వెంకటేశ్వర్లు, డీసీఎస్‌వో మోహన్‌బాబు, డీఎంహెచ్‌వో వెంకటరవణ, ఏబీసీడీఓ భీమ రాజు, వసతి గృహాల సంక్షేమ అధికారులు , కలెక్టరేట్, బీసీ అభివృద్ధి శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అశోక్ కుమార్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజం

ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. శుక్రవారం జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి అశోక్ కుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమం కలెక్టర్ మాట్లాడారు. అశోక్ కుమార్ బాధ్యతలు అత్యంత సమర్థవంతంగా నిర్వర్తించారన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులనే విక్రయించాలి

నాణ్యమైన, స్వచ్ఛమైన పాలతో తయారు చేసిన ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విజయ డెయిరీ కేంద్రాన్ని

మిగతా 8వ పేజీలో...


కూరగాయల వారీగా సాగు ఎకరాల్లో..

టమాట	4,200
ఉల్లి	3,380
క్యారెట్	1,663
పచ్చిమిర్చి	1,395
బెండ	1,276
క్యాబేజీ	1,271
ఇతరాలు	2,568

తొమ్మిది మండలాల్లోనే సాగు

జిల్లాలోని నవాబ్‌పేట్, వికారాబాద్, మర్పల్లి, మోమిన్‌పేట్, పరిగి, పూడూరు, దోమ, ధారూరు, కోట్‌పల్లి మండలాల్లో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు.

జిల్లాలో కూరగాయల సాగు అంతంత మాత్రంగానే ఉంది. ప్రజల అవసరాల మేరకు సాగు లేక మార్కెట్లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పలు మండలాల్లో కూరగాయలు, ఆకుకూరలను పండిస్తుండగా, రెండు నెలలుగా వేగంగా అడుగంటిపోతున్న భూగర్భ జలాలతో సాగు విస్తీర్ణం మరింత పడిపోయే పరిస్థితి దాపురించింది. జిల్లా ప్రజల అవసరాలే కాకుండా హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు సరఫరా చేసే విధంగా కూరగాయల సాగు ప్రోత్సహించేందుకు జిల్లాను వెజిటబుల్ హబ్‌గా అభివృద్ధి పరచాలనే ప్రతిపాదన పదేళ్లుగా ప్రభుత్వ పరిశీలనలో ఉంది. కానీ అది నేటికీ కార్యరూపం దాల్చని పరిస్థితి.



వెజిట్రబుల్స్!

- ఇతర జిల్లాల నుంచి తప్పని దిగుమతి
- నీటివసతి ఉన్నచోటే కాయగూరల పంటలు
- రెండు నెలలుగా తగ్గుతున్న భూగర్భ జలాలు
- జిల్లాలో మరింత తగ్గనున్న సాగు విస్తీర్ణం
- రాజధాని పక్కనే ఉన్నా కరువైన ప్రోత్సాహం
- కార్యరూపం దాల్చని వెజిటబుల్ హబ్ ఏర్పాటు



జిల్లాలో తగ్గుతున్న కూరగాయల సాగు

వికారాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఆశించిన స్థాయిలో కూరగాయలు పండక పోవడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మార్కెట్లో డిమాండ్ ఉన్న కూరగాయలు, ఆకుకూరలను పండించేలా రైతులను ప్రోత్సహించాలని గత పదేళ్లుగా ప్రభుత్వాలు పేర్కొంటున్నా ఆ ప్రకటనలు కార్యరూపం దాల్చడం లేదు. ఫలితంగా జిల్లాలో కూరగాయలు, ఆకు కూరల సాగు అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. ఇతర పంటలతో పోలిస్తే

మిగతా 8వ పేజీలో...

అత్యధికంగా టమాట పంట

జిల్లాలో అత్యధికంగా 4,200 ఎకరాల్లో టమాట సాగు చేస్తున్నారు. బీన్స్ 938 ఎకరాల్లో, కాలీఫ్లవర్ 935 ఎకరాలు, వంకాయ 887 ఎకరాలు, ఆలు 693 ఎకరాలు, బీరకాయ 651 ఎకరాలు, కాకర కాయ 651 ఎకరాలు, సోర కాయ 646 ఎకరాలు, చామగడ్డ 256 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇతర మండలాల్లో అక్కడక్కడ కూరగాయలు, ఆకుకూరల సాగు చేస్తున్నా స్థానిక, కుటుంబ అవసరాలకే పరిమితమవుతోంది.

జిల్లాలో కూరగాయల సాగు(ఎకరాల్లో..)

సంవత్సరం	కూరగాయలు	ఆకు కూరలు
2022-23	25,561	2,516
2023-24	23,565	2,516
2024-25	23,821	2,151

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

» రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు

కీసర రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణతో పాటు నేరగాళ్లను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలకమని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. కమిషనరేట్ పరిధిలోని 11 పోలీస్ స్టేషన్ల పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన 1,460 సీసీ కెమెరాలను నాగారంలోని ల్యాండ్ మార్క్ కన్వెన్షన్ హాల్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రద్దీ ప్రాంతాల్లో విరివిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటులో స్థానికులు భాగస్వాములు కావాలని సూచించారు. ఆలయాలు, వ్యాపార సముదాయాలు, అపార్టుమెంట్లు తదితర ప్రదేశాల్లో కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన వీడియోలు నేరస్థులను గుర్తించటంతో పాటు వారికి శిక్ష పడటంలో ఎవిడెన్స్‌గా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డీసీపీ పద్మజ, ఏసీపీలు చక్రపాణి, మహేశ్‌గౌడ్, నరేందర్‌గౌడ్, ఆయా పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా గురుకులం నిర్మాణ పనులు

- పాఠశాల అభివృద్ధికి రూ.20కోట్లు మంజూరు
- నిర్మాణ స్థలంలో బండరాళ్ల తొలగింపు
- ఎడ్యుకేషన్ హబ్‌గా మారనున్న కొడంగల్!

7

డబుల్ ఇళ్ల సంగతేంటి?

ఏడేళ్లుగా నిర్మాణాలు.. అర్హులకు అందని ఇళ్లు



- పరిగి పరిధిలో 680 డబుల్ ఇళ్ల నిర్మాణాలు
- ఇందిరమ్మ ఇళ్ల పథకంతో లబ్ధిదారుల్లో నిరాశ
- నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు
- ఇళ్ల కోసం ఆశగా చూస్తున్న పేద వర్గాలు

పరిగి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ప్రభుత్వం సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల మంజూరు చేయడం సంతోషకరమే అయినా పాత డబుల్ బెడ్‌రూం ఇళ్ల సంగతి ఏమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క లబ్ధిదారుడికి కూడా పరిగి పరిధిలో ఇల్లు ఇవ్వలేదు. ఆరంభశూరత్వంగా అక్కడక్కడ నిర్మాణాలు ప్రారంభించినా పనులు పూర్తి చేయని దుస్థితి. ప్రభుత్వం మారిన తర్వాత గ్రామాల్లో నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్లపై పేదలు గంపెడాశలు పెట్టుకున్నారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మొదటి విడతగా కేటాయించి, లబ్ధిదారుల జాబితాను కూడా ఇప్పటికే సిద్ధం చేసిన విషయం తెలిసిందే. అంతకుముందు పూర్తిగా తొలగించిన హౌసింగ్ శాఖను

మిగతా 8వ పేజీలో...

పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం



కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలందరికీ కొత్త ఇళ్లు నిర్మించి ఇస్తాం. సొంత స్థలం ఉంటే అక్కడే నిర్మించుకునే వారికి రూ.5 లక్షలు, స్థలం లేనివారికి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇస్తాం. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. అధికారులు, గుత్తేదారులతో ఇప్పటికే మాట్లాడాం. త్వరగా నిర్మాణాలు పూర్తి చేసి అర్హులకు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటాం.

-డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

విధులు బాధ్యతగా నిర్వర్తించాలి

డీఎంహెచ్‌వో వెంకటరవణ

వికారాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): విధులు బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరవణ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నూతనంగా నియమితులైన డాక్టర్లు, ఎంఎల్‌హెచ్‌పీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతీ వైద్యుడు, ఎంఎల్‌హెచ్‌పీ విధులకు సమయానికి హాజరై ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించాలన్నారు. మాతా శిశు సంరక్షణ, టీకాలు, టీబీ, లెప్రసీ వంటి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అంకితభావంతో పనిచేయాలని సూచించారు. వడదెబ్బ నుంచి ప్రజలను రక్షించేందుకు ఆశ కార్యకర్తల ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. నీరు, మజ్జిగ, నిమ్మరసం తరుచుగా తాగాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు జీవరాజ్, డాక్టర్ రవీంద్ర యాదవ్, ఇతర అధికారులు, డాక్టర్లు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్

బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధికి దూరం

» శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

మర్పల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం మర్పల్లి మండలంలోని కొంశెట్టిపల్లి, మొగిలిగుండ్ల, పట్లూర్, ఘనపూర్, జంషేడ్‌పూర్, రాంపూర్, కొత్లాపూర్, సిరిపూరం, పిల్లిగుండ్ల, గుండ్లమర్పల్లి, నర్సాపూర్, బిల్కల్, మల్లికార్జునగిరి గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. అలాగే మర్పల్లి నుంచి కోట్‌పల్లి వరకు, మర్పల్లి నుంచి మర్పల్లి తండా వరకు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామాలు, తండాలు అభివృద్ధిలో దూసుకెళ్తున్నాయన్నారు. అనంతరం కొంశెట్టిపల్లిలో సన్న బియ్యం పంపిణీ చేశారు. అలాగే రాంపూర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషక వారోత్సవాల్లో పాల్గొని పోషకాహారం పంపిణీ గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ మునిరోద్దీన్, ఎంపీడీవో రాజమల్లయ్య, ఎంపీవో లక్ష్మీకాంత్, కొండల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సురేశ్, రాములుయాదవ్, సుభాష్‌యాదవ్, నసీరుద్దీన్, అంజన్న, సుగ్రీవ్, సంజీవరెడ్డి, లక్ష్మి, వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న ఉపేందర్

లక్ష్యంతో ముందుకు సాగాలి

» బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఉపేందర్

పెద్దేముల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యం నిర్దేశించుకొని, ఆ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేయాలని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఉపేందర్ విద్యార్థులకు సూచించారు. పెద్దేముల్ మండలంలోని బీసీ వసతి గృహాన్ని శుక్రవారం ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నోట్‌పుస్తకాలను పరిశీలించి వారిచేతి రాత చూసి విద్యార్థులను ప్రశంసించారు. తల్లిదండ్రులు పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, వారి ఆశయాలను తప్పకుండా నెరవేర్చాలన్నారు. చదువుకున్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగం సాధించడం కష్టమే, కానీ చదువు సక్రమంగా ఉంటే బాగా బతకడం చాలా సులువు అవుతుందని అని చెప్పారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి
- 389 మంది లబ్ధిదారులకు రూ.4 కోట్ల విలువైన చెక్కుల పంపిణీ
- హాజరైన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



షాదీముబారక్ చెక్కును అందజేస్తున్న చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎంపీ ఈటల

శామీర్‌పేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, అన్ని హామీలను విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వానిదేనని ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపల్ పరిధిలోని అంతాయిపల్లి సమీపంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనతో పాటు ఎంపీ ఈటల రాజేందర్ హాజరై 389 మంది లబ్ధిదారులకు రూ.4 కోట్ల విలువైన కల్యాణలక్ష్మి, షాద్‌ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వానిదేనన్నారు.

బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజలు

అనంతరం తూంకుంట మున్సిపల్ పరిధిలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో వారం రోజులుగా జరగుతున్న బ్రహ్మోత్సవాల్లో చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ వజ్రేశ్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయల చైర్మన్ లక్ష్మీనారాయణ, జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక్ అజయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలుయాదవ్, వైఎస్‌గౌడ్, ఉపేందర్ రెడ్డి, యాదగిరిరెడ్డి, వెంకటగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జిల్లా అధికారులు

పూలేకు ఘన నివాళి

» మేడ్చల్ కలెక్టరేట్‌లో కార్యక్రమం

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జ్యోతిబాపూలే జయంతి వేడుకలను శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు ఝాన్సీ రాణి, వినోద్, సాంబశివరావు, ఎల్.రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలి

- మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి
- అధికారులు, రైస్ మిల్లుల యజమానులతో సమీక్ష

7

పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలి


మన్నెగూడ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ

పూడూరు, ఏప్రిల్ 11, (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం పూడూరు మండలంలోని మన్నెగూడ చౌరస్తాలో సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినా కేంద్ర ప్రభుత్వం ఒకేసారి సిలిండర్ ధర రూ.50వేలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్ విజయ్, అనంతయ్య, రాములు పాండు, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

కల్తీ జరిగితే సహించేది లేదు


బేకరీలో తనిఖీ చేస్తున్న అధికారులు

వికారాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల్లో కల్తీ జరిగితే సహించేది లేదని మున్సిపల్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు హెచ్చరించారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని పలు హోటళ్ల, స్వీట్‌హౌస్, రెస్టారెంట్లు, బేకరీలు, కర్రీ పాయింట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని నిర్వాహకులకు రూ.7 వేల వరకు జరిమానా విధించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, జవాన్లు శంకర్, వినోద్‌కుమార్, చిన్నయ్య, రాజు, ఆశయ్య, మహేందర్ తదితరులు ఉన్నారు.

ఓఆర్ఎస్‌తో ఆరోగ్యమస్తు

వేడిమి నుంచి ఉపశమనం
డీ హైడ్రేషన్‌కు గురికాకుండా రక్షణ
ఉపాధి హామీ పని ప్రదేశాల్లో తప్పక అవసరం



చేవెళ్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగల నుంచి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలి. రానున్న రోజుల్లో సాధారణం కంటే అధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు వచ్చే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యలో వడగాడ్పులు వస్తాయి. ఈ ఏడాది వాటి ప్రభావం మరింత ఎక్కువగా ఉండే అవకాశాలుండనున్నాయి. ఇప్పటికే ఉక్కపోత పెరిగింది. శ్రామిక, ఉద్యోగ, వ్యాపారులు విధి నిర్వహణలో భాగంగా అనివార్య పరిస్థితుల్లో మండే ఎండల్లో తిరగక తప్పని పరిస్థితి. అలాంటి సమయంలో డీహైడ్రేషన్‌కు గురైతే ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్)ఎంతో ఉపశమనం కలిగిస్తుందని వైద్యులు సూచిస్తున్నారు.

ఎండలతో తస్మాత్ జాగ్రత్త

గ్రామాల్లో ఉపాధి పనులు, ఇతరత్ర వ్యవసాయ పనులకు వెళ్లేవారు ఎక్కువగా ఉంటారు. ముఖ్యంగా మండుటెండల్లో పని చేయాల్సి ఉంటుంది. అటువంటి సమయంలో ఎండ ప్రభావానికి లోనుకాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. ఎక్కువ నీరు తీసుకుంటూ, ఓఆర్ఎస్ వంట ప్యాకెట్లను వెంట తెచ్చుకొని వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలని సూచిస్తున్నారు.ం

ప్యాకెట్ల రూపంలో లభ్యం

ఓఆర్ఎస్ అనేది వివిధ లవణాల మిశ్రమంతో కూడిన ద్రావణం. 20.5 గ్రాముల పౌడర్ ప్యాకెట్ రూపంలో దొరుకుతుంది. దీనిలో 2.6 గ్రాముల సోడియం క్లోరైడ్, 1.5 గ్రాముల పొటాషియం క్లోరైడ్, 2.9 గ్రాముల సోడియం సిట్రేట్, 13.5 గ్రాముల డెక్స్‌ట్రోజ్ ఉంటాయి. ఈ పౌడర్ ప్యాకెట్‌ను సురక్షితమైన లీటరు నీటిలో కలిపి రోజు మొత్తంలో వయస్సును బట్టి తగిన మోతాదులో తాగాలి. మితిమీరిన మోతాదులో తాగడము అనర్థాలకు దారితీస్తుంది.

వడ దెబ్బ తగిలే అవకాశం

వేసవిలో శరీరంలో సహజంగా నీటి శాతం తగ్గిపోవడంతో వడదెబ్బకు గురవుతుంటారు. ఇలాంటి ప్రమాదానికి గురికాకుండా ఓఆర్ఎస్ ద్రావణం ఉపకరిస్తుందని వైద్యులు చెబుతున్నారు. స్థలం, కాలాన్ని బట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. సరిపోను నీటిని తాగకపోయినా, ఎండలో ఎక్కువగా తిరిగినా డీహైడ్రేషన్‌కు గురవుతారు. ఈ స్థితిలో తల తిరగడం, నీరసం, నిస్సత్తువ, తలనొప్పి, జ్వరం, చీకటి కమ్మినట్లు అనిపిస్తుంది. వాంతి అవుతున్న భావన కలగడం వంటి లక్షణాలు వడదెబ్బకు గురైనట్లు తెలియజేస్తాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య, ఆరోగ్య కార్యకర్తల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయి. సమయానికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో లేకపోతే ఇంటిలోనే ఉప్పు, పంచదార, నీటి సాయంతో ఈ ద్రావణాన్ని తయారు చేసుకోవచ్చు. లీటరు నీటిలో చిటికెడు ఉప్పు, అర స్పూన్ పంచదారను కలిపి తాగవచ్చు. ఎండ తీవ్రతకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు.

డీహైడ్రేషన్‌ను తగ్గిస్తుంది



వేసవిలో వడదెబ్బ బారిన పడిన వారు డీ హైడ్రేషన్‌కు గురవుతారు. అటువంటి సమయంలో ముందుగా ఓఆర్ఎస్ వినియోగించడం వల్ల కొంత వరకు కోలుకుంటారు. ఓఆర్ఎస్‌లో అన్ని రకాల మినరల్స్ ఉంటాయి. అవసరమైన వారు తీసుకోవచ్చు.

- డాక్టర్, రాజేంద్రప్రసాద్, చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్

రోడ్డెక్కిన భగీరథ కార్మికులు

నిలిచిపోయిన తాగునీటి సరఫరా


మిషన్ భగీరథ ప్లాంట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

కొడంగల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాలతోపాటు తమ సమస్యలను పరిష్కరించాలని మిషన్ భగీరథ కార్మికులు సమ్మె చేపట్టారు. దీంతో శుక్రవారం దౌల్తాబాద్, దుద్యాల, బొంరాస్‌పేట్ మండలాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను విరమించేది లేదని కార్మికులు తేల్చిచెప్పారు.

షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వేణుగోపాల్‌రావు




షాద్‌నగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ న్యాయస్థానం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా న్యాయవాది నర్వ వేణుగోపాల్‌రావు గెలుపొందారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని న్యాయస్థానంలో జరిగిన ఎన్నికల్లో ఆయన సమీప ప్రత్యర్థి న్యాయవాది జగన్మోహన్‌రెడ్డిపై నాలుగు ఓట్లక తేడాతో గెలుపొందారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ తన విజయానికి కృషి చేసిన న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

బీజేపీది రాజ్యాంగాన్ని మార్చే కుట్ర


గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీది భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర అని జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్‌లు ఆరోపించారు. పార్టీ ఏఐసీసీ పిలుపుమేరకు శుక్రవారం మండలంలోని ధన్నారం, చిప్పలపల్లి, మురళీనగర్, దావుత్‌గూడతండా, పెద్దమ్మతండా గ్రామాల్లో జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించేది కాంగ్రెస్ మాత్రమేనన్నారు. నాయకులు సరికొండ పాండు, ఎండీ అఫ్జల్ బేగ్, సౌడపు వెంకటేశ్‌గౌడ్, యాదయ్య, సరికొండ జగన్, కత్తుల వెంకటేశ్, ఎస్‌డీ అజీజ్, బాబు, చిర్ర సాయిలు, బుక్క పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి


న్యాయవాది కరీంకు సభ్యత్వం కార్డు ఇస్తున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్‌అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పని చేసిన టీడీపీని బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. షాద్‌నగర్ పట్టణంలో టీడీపీ సభ్యత్వం కార్డుల పంపిణీలో భాగంగా పట్టణానికి చెందిన న్యాయవాది కరీంకు శుక్రవారం టీడీపీ సభ్యత్వం కార్డును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ గ్రామాన తిరిగి టీడీపీకి పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. టీడీపీ పుట్టింది బడుగుల అభివృద్ధి కోసమమేనన్నారు. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు కాట్రగడ్డ ప్రసూన కుమార్‌గౌడ్, నాయకులు నర్సింగ్‌రావు, దామోదర్ రావు, రాఘవులు, గందం ఆనంద్, సింగారం శ్రీనివాస్, కందూరి అంజయ్య గౌడ్ పాల్గొన్నారు.

పనితీరును బట్టే ప్రజల్లో గుర్తింపు



సీఐ ప్రమోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎస్ఐ వెంకటేశ్, సిబ్బంది

ఆమనగల్లు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పనితీరును బట్టే ఉద్యోగులకు ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని సీఐ బోయిని ప్రమోద్ కుమార్ అన్నారు. ఆమనగల్లు సీఐగా 14 నెలలు సేవలందించి ఆర్‌జీఐ ఎయిర్‌పోర్టు ట్రాఫిక్ సీఐగా బదిలీపై వెళ్తున్న ప్రమోద్ కుమార్‌కు శుక్రవారం పోలీసుస్టేషన్‌లో అభినందన వీడ్కోలు నిర్వహించారు. ఎస్ఐ వెంకటేశ్, పోలీసు సిబ్బంది ప్రమోద్‌కుమార్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఆయన సేవలను కొనియాడారు. ఎస్ఐ సీతారామ్‌రెడ్డి, ఏఎస్ఐ బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

చేవెళ్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 12వ తేదీన మొయినాబాద్ మున్సిపాల్ పరిధిలోని స్టార్ కన్వెన్షన్‌లో ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి సబితారెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ప్రతి ఒక్కరూ దైవస్మరణ చేయాలి


పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రత్నం

చేవెళ్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవస్మరణ చేయాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం అన్నారు. శుక్రవారం అల్లవాడలోని ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ పూజల్లో బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు ఎస్.ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు డాక్టర్ వైభవ్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, ఆంజనేయులుగౌడ్, దేవుని శర్వలింగం, అడెట్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై పోరాడాలి

» రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇబ్రహీంపట్నంలో రైతు సంఘం ఆధ్వర్యంలో సంఘం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమీందార్లు, జాగీర్దార్లకు వ్యతిరేకంగా అఖిల భారత కిసాన్ సభ చేసిన పోరు ఎన్నో ఫలితాలు తెచ్చిందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ మునలయ్య, రావుల జంగయ్య, తావూనాయక్, అంజనేయులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు భారీ విరాళం


కేటీఆర్‌కు చెక్కును అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి

షాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ సభకు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పట్నం అవినాష్‌రెడ్డి తనవంతు సహకారాన్ని అందిస్తున్నారు. పార్టీ కోసం రూ.25 లక్షల చెక్కును ఆయన శుక్రవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుకు అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ అవినాష్‌రెడ్డిని అభినందించారు. పార్టీ కార్యకర్తగా కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ కేటీఆర్, హరీష్‌రావు, సబితాఇంద్రారెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, కార్యకర్తలతో కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు.

ద్యాచారంలో బీజేపీ నేతల పర్యటన

వికారాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలియజేయడం, గ్రామస్థాయిలో సమస్యలు స్వయంగా తెలుసుకోవడమే లక్ష్యంగా గావ్ చలో- బస్తీ చలో కార్యక్రమం చేపడుతున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందారెడ్డి తెలిపారు. శుక్రవారం వికారాబాద్ మండల పరిధిలోని ద్యాచారం గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో పర్యటించి కేంద్ర పథకాల లబ్ధిదారులను కలిసి వారి అభిప్రాయాలను తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలోని బసవేశ్వర విగ్రహం వద్ద స్వచ్ఛ భారత్ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఆనందం, శిరీషాలం, చంద్రశేఖర్, యాదయ్య, రమేష్, ప్రసాద్ గౌడ్, నవీన్, విష్ణు, మంజునాథ్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదం తెలిపి చట్టం చేయడాన్ని నిరసిస్తూ ఘట్‌కేసర్‌లో శుక్రవారం ముస్లింలు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఘట్‌కేసర్‌లోని జామ మసీదులో నమాజ్ ముగిసిన అనంతరం భారీ బ్యానర్, ప్లకార్డులు, జాతీయ జండాలతోపాటు నల్ల జండాలు పట్టుకొని మసీదు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు అబ్దుల్ అజీజ్, నబి, ఖయ్యూం, ఫారుక్, ఖలీల్, సిరాజ్, తాహెర్‌తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

ఆమనగల్లు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతే లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డిలతో పంపిణీ చేశారు. నాయకులు వెంకట్‌రెడ్డి, బాల్‌రాజ్, జగన్, సత్యం, వెంకట్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన విద్యార్థి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలో గంజాయి విక్రయిస్తున్న ఒకరిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 290 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. ఇబ్రహీంపట్నం టౌన్ చైతన్యనగర్‌లో పలువురు విద్యార్థులు గంజాయి సేవిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై చందర్ తన సిబ్బందితో దాడులు చేయగా ఓ విద్యార్థి గంజాయితో పట్టుబట్టాడు. తన స్వగ్రామం ఖమ్మం నుంచి తనకు తెలిసినవారి సాయంతో గంజాయి తెచ్చినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలి

» టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

ఆదిభట్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలను కేటాయించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, ప్రధాన కార్యదర్శి పున్నయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని ఎస్‌ఎన్ హోటల్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులందరికీ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్‌లో జర్నలిస్టుల పిల్లలకు విద్యను ఉచితంగా అందించాలన్నారు. పలువురు జర్నలిస్టులు టీయూడబ్ల్యూజే(143)కు రాజీనామా చేసి టీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కార్యదర్శి పి. ఆనందం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు జగదీష్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సైదులు, వార్త జిల్లా బ్యూరో చీఫ్ రఘుపతి, దిశ జిల్లా బ్యూరో చీఫ్ సురేష్, సాక్షి జిల్లా బ్యూరో చీఫ్ శ్రీశైలం, వార్త జిల్లా బ్యూరో చీఫ్ గణేష్, ఆంధ్రజ్యోతి జిల్లా స్టాఫర్ శ్రీనివాస్‌చారితో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

జోరుగా గురుకులం పనులు

రూ.20 కోట్లతో జ్యోతిబాపూలే గురుకుల నిర్మాణం

» నిర్మాణ స్థలంలో బండరాళ్ల తొలగింపు

» ఎడ్యుకేషన్ హబ్‌గా మారనున్న కొడంగల్!

» తీరనున్న విద్యార్థుల ఇబ్బందులు



కొడంగల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా కొడంగల్ జ్యోతిరావు బాపూలే గురుకుల పాఠశాల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. పట్టణ శివారులోని పరిగి రోడ్డుకు సమీపంలో ఉన్న ఈ గురుకుల పాఠశాలను 20 ఏళ్ల క్రితం నిర్మించారు. అప్పట్లో ఆరో తరగతి వరకు సరిపోను వసతులు కల్పించారు. రానురాను ఎస్ఎస్‌సీ, ఇంటర్ వరకు పెంచారు. సౌకర్యాల లేమితో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంతో అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్‌రెడ్డి నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకున్నా ముందుకు సాగలేదు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల నిర్మాణానికి కాంట్రాక్టర్ ఎలుగుబంటి సూర్యానారాయణ పనులు చేపట్టినా నాసిరకంగా ఉన్నాయని పనులు నిలిపివేశారు. అప్పటినుంచి ఉన్న తరగతి గదుల్లోనే కాలం వెళ్లదీస్తూ వచ్చారు. పాఠశాల స్థాయి పెరిగి ఇరుకుగా మారడంతో గురకులాన్ని చేవేళ్ల ప్రాంతంలో నిర్వహిస్తున్నారు. గురుకుల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించడంతో నూతన భవనాల నిర్మాణానికి మార్గం సుగమం అయ్యింది.

నిధులు మంజూరుతో పనులు వేగవంతం

గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రేవంత్‌రెడ్డి గురుకులాల అభివృద్ధికి కృషి చేసినా పలు కారణాలతో పనులు ముందుకుసాగలేదు. ప్రస్తుతం సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గురుకుల భవన నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేయడంతో పనుల్లో వేగం పెరిగింది. భవన నిర్మాణ స్థలంలో పెద్ద, పెద్ద బండరాళ్లు ఉండటంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. బండరాళ్లను ఆధునిక యంత్రాలతో తొలగిస్తున్నారు. నూతనంగా నిర్మిస్తున్న భవనాల్లో తరగతి గదులు, డైనింగ్ హాల్, ఉండేందుకు వసతి ఏర్పాటు తదితర సదుపాయలు కల్పిస్తున్నారు. భవనం పూర్తయితే సౌలభ్యంగా ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.



ఎడ్యుకేషన్ హబ్‌కు చర్యలు

సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్‌హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా కొడంగల్‌కు మెడికల్, నర్సింగ్, వెటర్నరీ, వ్యవసాయ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, సమీకృత గురుకులాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం కొడంగల్‌కు మంజూరైన గురుకులాలకు స్థానికంగా స్థలం లేకపోవడంతో దూర ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. వాటిని స్థానికంగా ఏర్పాటు చేసేందుకు కొడంగల్ పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ దగ్గర రూ.20 కోట్ల వ్యయంతో గురుకుల నిర్మాణం, దౌల్తాబాద్ మండలంలో మరో రూ.20 కోట్ల వ్యయంతో దేవరఫస్లాబాద్‌లో, బొంరాస్‌పేట్ మండలంలోని బురాన్‌పూర్ దగ్గర రూ.20 కోట్లతో గురుకులాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

భవనం పూర్తితో విద్యార్థులకు మేలు



ప్రస్తుతం విద్యార్థులకు సరిపడే తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. నూతన గురుకుల పాఠశాల భవన నిర్మాణం పూర్తయితే విద్యార్థుల సమస్యలు తీరుతాయి. నిర్మాణం పూర్తయితే ఇంటర్ విద్యార్థులు ఇక్కడే ఉంటూ చదువుకునే అవకాశం ఉంటుంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నూతన భవనం మంజూరవడం హర్షనీయం.

- నాగేశ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్

ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుకు కృషి



కొడంగల్ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారు. మెడికల్, వెటర్నరీ, ఇంజినీరింగ్, నర్సింగ్, వ్యవసాయ కళాశాలలతోపాటు సమీకృత గురుకులాలు, మండల కేంద్రాల్లో నూతన గురుకుల పాఠశాలల నిర్మాణానికి చర్యలు తీసుకున్నాం. స్థానికంగా విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుంది.

- తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వీడియోలు

» వ్యక్తిపై కేసు నమోదు

చౌదరిగూడ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వీడియోలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. శుక్రవారం షాద్‌నగర్ రూరల్ సీఐ నరసయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధి వనంపలి గ్రామానికి చెందిన సూరారం భూపాల్ శుక్రవారం మధ్యాహ్నం సోషల్ మీడియాలో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలు దెబ్బతీసేలా పాటలను చిత్రికరించిన వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశాడు. ఈ వీడియోలు వైరల్ కావడంతో గ్రామానికి చెందిన గందే రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామ, అల్లుడి మధ్య మటన్ చిచ్చు!

» అల్లుడిపై కత్తితో దాడి.. మామకు రిమాండ్

చౌదరిగూడ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మామ, అల్లుడి మధ్య మటన్ చిచ్చు పెట్టింది. అల్లుడిపై మామ కత్తితో దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటన గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని ఎదిరలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ ఏఎస్‌ఐ ఛత్రీయ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎదిర గ్రామానికి చెందిన రవి గురువారం చౌదరిగూడలో జరిగే సంతకు కూరగాయాలు తీసుకువచ్చేందుకు వెళ్లాడు. సంతకు వెళ్లి మటన్ తీసుకురాకపోవడంతో మామ యాదగిరి అల్లుడు రవి మధ్య గొడవ జరిగింది. యాదగిరి కత్తితో దాడి చేయడంతో రవికి గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి యాదగిరిని రిమాండ్‌కు తరలించారు.

గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు భూములివ్వం

» లేమూరు, అగర్‌మియాగూడ గ్రామాల రైతులు


భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజుకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కందుకూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూములు ఇచ్చేది లేదని లేమూరు, అగర్‌మియాగూడ గ్రామాల రైతులు మరోసారి తేల్చి చెప్పారు. రెవెన్యూ అధికారులు ఔటర్ రింగ్‌రోడ్డు రావిరాల ఎగ్జిట్-13 నుంచి మండలంలోని తిమ్మాపురం, లేమూరు, అగర్‌మియాగూడ, రాచులూరు. మీర్కాన్‌పేట రెవెన్యూ గ్రామాల్లో 330 ఫీట్ల వెడల్పుతో భూ సర్వే పనులు పూర్తి చేశారు. రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులకు ఇటీవల అధికారులు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు మండలంలోని లేమూరు పంచాయతీలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో లేమూరు, అగర్‌మియాగూడ గ్రామాల రైతులు మూకుమ్మడిగా సమావేశానికి వచ్చి డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు సుధాకర్‌రెడ్డి, లిక్కి. జంగారెడ్డి, డిల్లీ గణేశ్, కడారి జంగయ్య, పాండురంగారెడ్డి, మహిపాల్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం తమ భూముల గుండా గ్రీన్‌ఫీల్డు పేరుతో తమ భూములను తీసుకోవడాన్ని విరమించుకోవాలన్నారు. మీర్కాన్‌పేటలో నెలకొల్పనున్న ఫ్యూచర్‌సిటీ వద్దకు ఇప్పటికే 250 ఫీట్ల వెడల్పుతో రోడ్డు వేసి ఉందన్నారు. కానీ, 330 ఫీట్ల వెడల్పుతో మరో రోడ్డు ఎందుకని ప్రశ్నించారు. తమకు రెండు, మూడు ఎకరాలు మాత్రమమే ఉన్నాయని, అందులో 90శాతం భూములు రోడ్డు కోసం సేకరిస్తే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ రాజు మాట్లాడారు. గ్రీన్ ఫీల్డు రోడ్డు ఏర్పాటుకు రైతులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామని, రైతులు ఇచ్చిన ఫిర్యాదులను కలెక్టర్ నారాయణరెడ్డిని నివేదిక రూపంలో అందజేస్తానని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలి

» మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ కలెక్టరేట్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ధాన్యం సేకరణపై సంబంధిత అధికారులు, రైస్ మిల్లులు యజమానులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలని, జిల్లాలో 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, దానికి సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు తడి, తాలు, దుమ్ము లేకుండా ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైస్‌మిల్లుల యజమానులను సన్నవడ్ల దిగుమతుల సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతు ధాన్యం అమ్మిన 48 గంటల్లో నేరుగా వారి ఖాతాలో డబ్బులు జమ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు సుగుణాబాయి, చంద్రకళ పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, షాద్‌నగర్ ఇన్‌చార్జి అందె బాబయ్య అన్నారు. బీజేపీ అధిష్టానం పిలుపుమేరకు 'గావ్ చలో- బస్తీ చలో' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్తులతో మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి మూడు రోజులపాటు కేంద్ర మంత్రి నుంచి కార్యకర్త వరకు గ్రామాల్లో పర్యటించి కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన పనుల ప్రగతిని పరిశీలిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ దుకాణం, చెరువును పరిశీలించారు. ముద్ర రుణాలు పొంది లబ్ధి పొందిన వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్ గుప్త, ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంకనొళ్ల వెంకటేష్, నాయకులు అంజయ్య గౌడ్, బాబు, ఆనంద్, శివ కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మాల్‌లో కేంద్ర బృందం పర్యటన

యాచారం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన నిధులతో అభివృద్ధి పనులు చేసి ప్రజల ఇబ్బందులు తీర్చడం అభినందనీయమని మినిస్ట్రీ ఆఫ్ రూరల్‌డెవలప్‌మెంట్ బృందం పంకజ్, చంద్రణ్ అన్నారు. శుక్రవారం యాచారం మండలంలోని మాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఎంత మేర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు అందాయి, వాటిని దేనికోసం ఎంత మేర వెచ్చించారో అందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పంచాయతీ రికార్డులు పరిశీలించి అధికారులను అభినందించారు. డంపింగ్‌యార్డును చూసి తడి, పొడి చెత్తను వేరు చేసి వాడడం మంచిదన్నారు. వారివెంట ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత తదితరులున్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

» డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ శ్రీదేవి


మున్సిపల్‌లో చిల్డ్రన్ పార్కును పరిశీలిస్తున్న శ్రీదేవి

శంకర్‌పల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులు పూర్తి స్థాయిలో వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శ్రీదేవి ఆదేశించారు. శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పాల్గుణ్‌కుమార్‌తో కలిసి సమీక్షా నిర్వహించారు. ఇంటి పన్నులు 100 శాతం వసూలయ్యేలా కార్యచరణ రూపొందించుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నల్లా నీళ్ల సరిపోకపోతే ట్యాకర్లతో అందించాలని సూచించారు. మున్సిపల్‌కు చెందిన భూములను కాపాడేందుకు చర్యలు తీసుకువాలన్నారు. చిల్డ్రన్ పార్కులను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. దుకాణాల అద్దె విషయాల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సాయినాథ్, మున్సిపల్ కమిషనర్ యోగేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి కేంద్రం నిధులు

» చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

ధారూరు, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోడ్ల నిర్మాణానికి కేంద్రం రూ.600 కోట్లు కేటాయించిందని, ఇందులో వికారాబాద్ జిల్లాకు నిధులు వచ్చాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ధారూరు, నాగారం, స్టేషన్ ధారూరు, రుద్రారం, అల్లీపూర్ గ్రామాల్లో రూ.30లక్షల ఎంపీ, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పక్షపాత ధోరణితో ఈ ప్రాంతం వెనుకబడిపోయిందని, సిద్దిపేట వెళ్లి చూస్తే హైదరాబాద్ కన్నా ఎక్కువ అభివృద్ధి జరిగిందన్నారు. అక్కడ గ్రామాల్లోనూ ఫ్లైఓవర్లు నిర్మించారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పక్షపాతం లేకుండా అన్ని జిల్లాలను సమానంగా అభివృద్ధి చేయాలన్నారు. దురదృష్టవశాత్తు మన్నెగూడ హైదరబాద్ హైవే రోడ్డు పనులు ఇంకా ప్రారంభం కాలేదని, గత పాలకులు రియల్ ఎస్టేట్ కోసం వంకరటింకర భూసేకరణ చేయటం వల్ల రోడ్డు పనుల ప్రారంభానికి అటంకాలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, మండలాధ్యక్షుడు రాజునాయక్, నియోజకవర్గ అసెంబ్లీ కోఆర్డినేటర్ వి.నందు, నాయకులు పాండు గౌడ్, వివేకానంద రెడ్డి, నరోత్తం రెడ్డి, ఎం.రమేశ్, రాజేందర్ గౌడ్, రవీందర్ గౌడ్, సాయిగౌడ్, కె.అంజయ్య, జగదీశ్వర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

చేవెళ్ల: హనుమాన్ జయంతి సందర్భంగా ఈనెల 12న నిర్వహించే శోభయాత్రను విజయవంతం చేయాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలో హనుమన్ జయంతి సందర్భంగా శోబాయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. శోభయాత్రలో ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్టీ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు దేవుని శర్వలింగం, శ్రీనివాస్, మాణిక్యరెడ్డి ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

శంషాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. రెండు రోజుల పాటు శంషాబాద్‌లోని ఎలైట్ హోటల్‌లో మహాసభలు ఉంటాయని తెలిపారు. సమావేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం కార్మికులతో కలసి విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు నర్రాగిరి, శేఖర్‌రెడ్డి, మల్లేష్, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

పార్వతీపరమేశ్వరుల కల్యాణం

కోట్‌పల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోత్కుపల్లిలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, విగ్రహాల ప్రతిష్ఠాపనను శుక్రవారం గ్రామ పెద్దలు, గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు.

కబ్జాపై చర్యలు తీసుకోవాలి

పూడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మిట్టకంకట్ గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. మండల పరిధిలోని మిట్టకంకల్ గ్రామం సర్వేనెంబర్-1 ప్రభుత్వ భూమి ఖాళీ స్థలంలో ఇదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మొర్రి శ్యామ్‌కుమార్ రాత్రికి రాత్రే ట్రాక్టర్‌తో దున్ని కబ్జా చేసుకున్నాడని వినతిపత్రంలో తెలిపారు.

తాండూరులో జాబ్‌మేళా

తాండూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం సింధూ జూనియర్ కళాశాలలో జ్యోతిరావుపూలే జయంతి పురస్కరించుకొని శుక్రవారం బీసీ సంఘం, గ్లోబల్ యువతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించగా విశేష స్పందన లభించింది. 86 మంది నిరుద్యోగులకు నియామక పత్రాలను అందజేశారు.

సన్నబియ్యం ధరలు తగ్గుముఖం

● రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ ఎఫెక్ట్



కులకచర్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు నెమ్మదిగా తగ్గుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు దిగివస్తున్నాయి. గతంలో బియ్యం వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా ధరలు పెంచి సన్నబియ్యాన్ని అమ్మేవారు. అంతేకాకుండా పాలిష్ చేసిన ఇతర బియ్యాన్ని కూడా సన్నబియ్యంలో కలిపి సామాన్య ప్రజలకు అమ్మేవారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తుండటంతో మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా పోయింది. దీంతో బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం డిమాండ్ క్రమంగా తగ్గుతూ ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. గతంలో క్వింటాలు సన్నబియ్యం రూ.5600 నుంచి రూ.6వేల వరకు అమ్మకాలు సాగించారు. ప్రస్తుతం డిమాండ్ తగ్గడంతో క్వింటాలు సన్న బియ్యం రూ.4500 నుంచి రూ.5వేల వరకు లభిస్తున్న పరిస్థితి ఏర్పడింది. గతంలో ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు దొడ్డు బియ్యం ఇచ్చేవారు. వాటిని ప్రజలు తినకుండా దళారులకు అమ్ముకునే వారు. అనంతరం బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యంను కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వం నాణ్యమైన సన్న బియ్యం పేద ప్రజలకు అందిస్తే బహిరంగ మార్కెట్‌లో అందరికీ సన్న బియ్యం ధరలు తగ్గి అందుబాటులో ఉండే అవకాశం ఉంది.

ప్రభుత్వ పుణ్యమే



ప్రభుత్వ పుణ్యమే మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు తగ్గుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ దెబ్బతో మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు తగ్గి సామాన్య ప్రజలు కొనుగోలు చేసే వీలు కలుగుతుంది.

- బీఎస్.ఆంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్

పూలే జీవితం నేటి తరానికి ఆదర్శనీయం



వికారాబాద్: పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

పరిగి: మహాత్మా జ్యోతిబాపూలే జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డిలు అన్నారు. పూలే 199వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా పరిగిలోని మహాత్మాజ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వికారాబాద్: వికాస్ కళాశాల ఆవరణలో శుక్రవారం మహాత్మ జ్యోతిబాపూలే 198వ జయంతి కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

యాలాల: పూలేకు భారతరత్న ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య పిలుపునిచ్చారు. పూలే 199వ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెద్దేముల్: పాషాపూర్‌లో కాంగ్రెస్‌పార్టీ నాయకులు మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, గోపాల్, మహిపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పూడూరు: అంగడిచిట్టెంపల్లిలో శుక్రవారం మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూడూరు మండల కేంద్రంలో జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా మాజీ ఎంపీపీ మల్లేశం గ్రామంలో పూలే విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ చేశారు. చంద్రయ్య, శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

తాండూరు: తాండూరు బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో బీఎస్పీ ప్రధాన కార్యదర్శి బోయిని చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు తలారి నరేందర్ పాల్గొన్నారు. అదేవిధంగా తాండూరు దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే జయంతి వేడుకలను తాండూరు పట్టణం అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు.

కోట్‌పల్లి: జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని మండలంలోని బార్వాద్ గ్రామంలో పూలే విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు నర్సింహులు పూలమాలవేసి నివాళులర్పించారు.

కీసర: జ్యోతిబాపూలే జయంతి వేడుకలు కీసరలో ఘనంగా జరిగాయి. శుక్రవారం జరిగిన వేడుకల్లో భాగంగా పలువురు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దుద్యాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈవో విజయరామారావు ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మా జ్యోతిబాపూలే 109వ జయంతిని నిర్వహించారు.

కొడంగల్: కొడంగల్ పట్టణ శివారులోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో శుక్రవారం పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ నగేశ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొడంగల్ రూరల్: పూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో మహాత్మా జ్యోతిబాపూలే 198వ జయంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా పట్టణంలోని వీబీఆర్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో పూలే చిత్రపటానికి విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కులకచర్ల: కులకచర్లలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి పాల్గొన్నారు.

కీసర రూరల్: నాగారంలోని గురుకుల పాఠశాలలో జ్యోతిబాపూలే జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాగారం జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సకీనా పూలమాలలు వేసి నివాళర్పించారు.



మూడుచింతలపల్లి: జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మూడుచింతలపల్లి: మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా శుక్రవారం లక్ష్మాపూర్‌లో ఆయన చిత్రపటానికి లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ ఆంజనేయులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

ఘట్‌కేసర్: మహాత్మా జ్యోతిబాపూలే నేటి తరానికి ఆదర్శప్రాయుడని పలువురు కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, ఆర్టీకే కాలనీలో సీపీఎం నాయకులు జ్యోతిబాపూలే 198వ జయంతి సందర్భంగా వేర్వేరుగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్రైం కార్నర్

కారు డోర్‌ను ఢీకొన్న బైక్.. వ్యక్తి మృతి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో కారు డోర్‌తీయగా బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. అవుశాపూర్‌కు చెందిన సామల వీరాచారి(45) వెల్డింగ్ షాపు నిర్వహిస్తుంటాడు. శుక్రవారం వీరాచారి తన బైక్‌పై ఘట్‌కేసర్‌కు వచ్చి పనిముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుతుండగా అంకుశాపూర్‌లోని హెచ్‌పీసీఎల్ సంస్థ సమీపంలో డ్రైవర్ నిర్లక్ష్యంగా తన కారుడోర్‌ను తీశాడు. అటువైపు నుంచి వస్తున్న వీరాచారి కారు డోర్‌కు ఢీకొని తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు అన్ని వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా వీరాచారి చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో యాచకుడు..

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో గుర్తుతెలియని యాచకుడు మృతిచెందాడు. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం మున్సిపాలిటీ, తెనుగూడ సమీపంలో పోలీసు వాహనం గస్తీ చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి(60) అపస్మారకస్థితిలో పడిఉన్నాడు. వెంటనే 108 వాహనానికి సమాచారం అందించి పరీక్షించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు తెలిపారు. మృతుడు కొద్ది రోజులుగా తెనుగుడెం పరిసర ప్రాంతంలో బిక్షాటన చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. అతడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోచారం ఐటీ కారిడార్ పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



పట్టుబడిన నిందితుడు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పారిశ్రామిక వాడ నుంచి కిష్టాపూర్ వెళ్లే దారిలో ఉమర్ అలీ(27) అక్రమంగా గంజాయి తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు అదుపులో తీసుకున్నారు. అతడివద్ద నుంచి 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఉమర్‌అలీపై కేసునమోదు చేసుకుని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

అడవి పంది దాడిలో వలస కార్మికుడికి తీవ్రగాయాలు

తాండూరు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నాపరాతి గనిలో పనిచేసేందుకు వెళ్లగా ఒక్కసారిగా వలస కార్మికుడిపై అడవి పంది దాడి చేసింది. దీంతో ఆయన తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఓగీపూర్ గ్రామ శివారులోని నాపరాతి గనిలో కర్ణాటకలోని కర్చికలం గ్రామానికి చెందిన దేవప్ప కొంతకాలంగా ఓగీపూర్ గ్రామ శివారులోని నాపరాతి గనిలో కట్టర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. దీంతో నాపరాతి గనిలో బండలను కట్ చేసేందుకు వెళ్లగా అడవి పంది దాడి చేయడంతో దేవప్పకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తోటి కార్మికులు గని యజమానికి సమాచారం అందించారు. ఆయనను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం దేవప్ప పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

నాటుసారా స్థావరంపై దాడులు

దౌల్తాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచమ్మగడ్డతండాలో ఎస్ఐ రవిగౌడ్ పోలీసు సిబ్బందితో కలిసి శుక్రవారం నాటుసారా స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తండాకు చెందిన సభావత్ గుండమ్మ ఇంటి ముందు ఉన్న గుడిసెలో సారా బట్టీలో సారాయి తయారు చేస్తుండగా 2.5 లీటర్ల సారాయిని సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దొంగ రిమాండ్



మహ్మద్ మొయిన్ షరీఫ్

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వెండి అభరణాలను ఎత్తుకెళ్లిన దొంగను ఘట్‌కేసర్ పోలీసులు 12 గంటల్లో అదుపులోకి తీసుకోని శుక్రవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. క్రైం ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మేడాపాటినగర్‌లో నివాసముంటున్న సునీత ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరగడంతో శుక్రవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఘట్‌కేసర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహ్మద్‌మొయిన్ షరీఫ్(23)ను అదుపులోకి తీసుకొని అతడి వద్ద నుంచి వెండి అభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితున్ని సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు క్రైం ఎస్ఐ తెలిపారు.

భార్యను వేధించిన కేసులో భర్తకు జైలు

● రూ.10వేల జరిమానా

కీసర రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): భార్యను వేధించటంతో పాటు భౌతికదాడికి పాల్పడిన కేసులో నిందితునికి న్యాయస్థానం ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పును వెలువరించింది. కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ భవాని నగర్‌కు చెందిన రామహరిప్రసాద్ ఓమహిళను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. కాగా అతను తరచూ అమెను వేధించటంతో పాటు భౌతిక దాడులకు పాల్పడేవాడు. వేధింపులు తాళలేక 2020లో కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితుడిపై కేసు నమోదుచేసి, విచారణ చేపట్టారు. న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టారు. ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధించింది.

వార్డు ఆఫీసర్‌పై కేసు నమోదు

తాండూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో వార్డు అధికారిగా పని చేస్తున్న నవాజ్ ఓవ్యక్తిపై తాండూరు పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. అధికారులకు ఫోన్‌లో బెదిరిస్తున్నట్లు మెసెజ్‌లు పెట్టడంతో పాటు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపి కేసు నమోదు చేసినట్లు తాండూరు పోలీసులు తెలిపారు. గతంలోనే ఈ అధికారిపై రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లోనూ కేసు నమోదైనట్లు సమాచారం సంబంధిత అధికారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు గానూ మున్సిపల్ అధికారులు కలెక్టర్‌కు నివేదిక పంపారు.

'డబుల్' ఇళ్ల సంగతేంటి?

(ఐదో పేజీ తరువాయి)

సైతం ప్రభుత్వం తిరిగి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా గత ప్రభుత్వం నిర్మించతలపెట్టిన డబుల్ ఇళ్ల నిర్మాణాలు ఎప్పుడు పూర్తి చేస్తారు? ఎవరికి కేటాయిస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

వివిధ దశల్లో నిర్మాణాలు

గత ప్రభుత్వం పరిగి నియోజకవర్గ పరిధిలో మొత్తం 680 డబుల్ ఇళ్లను మంజూరు చేసింది. 2015 అక్టోబర్ 22న శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కొన్ని పూర్తి కాగా, మరి కొన్ని వివిధ దశల్లో నిర్మాణాలు సాగుతున్నాయి. పరిగిలో 300, పూడూరులో 50, దోమలో 50, కులకచర్లలో 80, గండీడ్‌లో 100, మహ్మదాబాద్‌లో 100 చొప్పున ఇళ్లను మంజూరు చేశారు. కాగా, పరిగిలో 180 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 120 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయి. పూడూరులో బెస్‌మెంట్‌స్థాయి, దోమలో స్లాబ్‌స్థాయి, గండీడ్, మహ్మదాబాద్‌లలో బెస్‌మెంట్‌స్థాయి, కులకచర్లలో అసలు పనులే ప్రారంభించనేలేదు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు, వివిధ స్థాయిలలో ఉన్న ఇళ్లకోసం గత ప్రభుత్వంలో దరఖాస్తులు కూడా స్వీకరించారు. అయితే ఇప్పుడు పూర్తయిన ఇళ్లను పంపిణీ చేసేందుకు లబ్ధిదారులను ఎంపిక చేస్తారా..? తిరిగి దరఖాస్తులు తీసుకుంటారా..? అనే ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్ల నిర్మాణాలను స్వాగతిస్తున్నామని, అయితే పాత డబుల్ ఇళ్లను కూడా లబ్ధిదారులకు కేటాయించాలని పేదలు కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

దౌల్తాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి చెందిన ముత్యాలు జాన్‌వెస్లీకి రూ.లక్ష, వల్లిరి నర్సప్పకు రూ.57వేలు, బీ.ధరణిరెడ్డికి రూ.50వేలు, జీ.మల్కమ్మకు రూ.53వేలు విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్ సహకారంతో మాజీ ఎంపీటీసీ మంజుల దస్తప్ప లబ్ధిదారులకు అందజేశారు.

బొంరాస్‌పేట్: మండలంలోని బొట్లవనితండా గ్రామ పంచాయతీ పరిధిలోని దేవులనాయక్ తండాకు చెందిన వడ్త్య మునేశ్‌కు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శుక్రవారం కాంగ్రెస్ నాయకులు బాధితుడికి అందజేశారు.

కులకచర్ల: కులకచర్ల, పుట్టపహాడ్, బొంరెడ్డిపల్లి, చెరువు ముందలి తండా, బజ్జనాయక్ తండాకు చెందిన లబ్ధిదారులకు మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు.

కీసర: నాగారం మున్సిపల్‌కు చెందిన ఆకుల సుభాష్‌కు రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరు కాగా శుక్రవారం వజ్రేష్‌యాదవ్ బాధితుడికి అందజేశారు.

గురుకులంలో రాష్ట్రస్థాయి ర్యాంకులు

దౌల్తాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకఫస్లాబాద్‌లోని న్యూ మాస్టర్ మైండ్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు కూర కల్యాణి, రాథోడ్ గౌతమ్ రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ అరుణ్ మోలియన్, కరస్పాండెంట్ నాగప్ప, చైర్మన్ సతీశ్ ముదిరాజ్ తెలిపారు. ఐదో తరగతి విద్యార్థిని కూర కల్యాణి రాష్ట్ర స్థాయిలో 1102 ర్యాంకు, నారాయణపేట జిల్లా స్థాయిలో 8వ ర్యాంకు, మరో విద్యార్థి రాథోడ్ గౌతమ్ రాష్ట్ర స్థాయిలో 884వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షకు 32 మంది విద్యార్థులు హాజరు కాగా 21 మంది సీట్లు సాధించారు.

జ్యోతిబా పూలే ఆదర్శప్రాయుడు

(ఐదో పేజీ తరువాయి)

ఆయన ప్రారంభించారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి మన దుకాణం, జిరాక్స్ స్టేషనరీ దుకాణాలను పరిశీలించారు.

పోషణ పక్షాన్ని విజయవంతం చేయాలి

పోషణ అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ పక్షం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన మహిళా, శిశు సంక్షేమ, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ, వైద్య శాఖ, పంచాయతీరాజ్ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోషణ లోపం ఉన్న పిల్లలను గుర్తించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవసరమైన పోషకాహారం గురించి వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీపీవో జయసుధ, డీఆర్డీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో వెంకటరవణ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలకు బాధ్యత తీసుకోవాలి

మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని సమాజానికి తోడ్పడాలని కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎక్సైజ్, విద్యాశాఖ, జిల్లా సంక్షేమ, వ్యవసాయ, పోలీస్ వివిధ శాఖల అధికారులతో మాదక ద్రవ్య నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. గ్రామాలలో పర్యటించే క్రమంలో మహిళా స్వయం సంఘాలు, అంగన్‌వాడీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థలు మాదక ద్రవ్యాల వాడకం వల్ల జరిగే నష్టాలపై అవగాహన చేపట్టాలని సూచించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తూ అడ్డుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఆర్‌డీవో శ్రీనివాస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్ గౌడ్, వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి, డీఎంహెచ్‌వో వెంకటరవణ, డీవైఎస్‌వో హన్మంత్‌రావు, అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఆర్‌టీవో వెంకట్ రెడ్డి, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శంకర్ నాయక్, డీపీవో జయసుధ, మునిసిపల్ కమీషనర్‌లు పాల్గొన్నారు.

వెజి'ట్రబుల్స్'!

(ఐదో పేజీ తరువాయి)

కూరగాయల సాగు చేసే రైతులకు తక్కువ రోజుల్లో ఆదాయం చేతికందే అవకాశం ఉంటుంది. ఈ సాగులో రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. వెజిటబుల్ హబ్‌గా ప్రకటించి రైతులను ప్రోత్సహిస్తే ఇతర ప్రాంతాలకూ సరఫరా చేసే విధంగా కూరగాయలు, ఆకుకూరల దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది.

పండిస్తున్న కాయగూరలు

ఆయా గ్రామాల్లో టమాట, వంకాయ, క్యారెట్, ఆలు, కాలీఫ్లవర్, క్యాబేజీ, ఉల్లి, బెండ, చిక్కుడు, పొట్ల, మునగ, మిర్చి, పాలకూర, మెంతి, పాయిల్‌కూర, తోటకూర వంటి కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా పండిస్తున్నారు. జిల్లాలో కూరగాయలు, ఆకుకూరల సాగులో ఇతర మండలాలతో పోలిస్తే నవాబ్‌పేట్ మండలం అగ్రస్థానంలో ఉంది.

రైతులను ప్రోత్సహిస్తేనే..

కూరగాయల సాగు చేపట్టే రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు సరఫరా చేసి ప్రోత్సహించాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. రైతులను ప్రోత్సహిస్తేనే కూరగాయలు, ఆకుకూరల సాగు విస్తీర్ణం పెరిగేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వం పామాయిల్ సాగును ఏ విధంగా ప్రోత్సహిస్తున్నదో అదే తీరులో కూరగాయల సాగు పెరిగేలా ప్రోత్సహిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో నీటి వసతి ఉన్న రైతులే కూరగాయలు సాగు చేస్తున్నారు. గత ప్రభుత్వం జిల్లాలో కూరగాయల సాగు పెంపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించినా అది ప్రకటనలకే పరిమితం కావడం గమనార్హం. జిల్లాను వెజిటబుల్ హబ్‌గా ప్రకటించి కూరగాయల సాగుకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంటుంది.

రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యం

పరిగి,ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం పరిరక్షణే లక్ష్యంగా జైబాపు, జైభీమ్, జై సంవిదాన్ పేరిట ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. జైబాపు, జైభీమ్, జై సంవిదాన్‌లో భాగంగా శుక్రవారం పరిగి మునిసిపల్ పరిధిలోని రెండు,మూడు, 11 వార్డుల్లో రాజ్యాంగ పరిరక్షణ యాత్రను చేపట్టారు. గాంధీ చౌక్‌లోని గాంధి విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్థసారథి, ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కె.హన్మంత్‌ముదిరాజ్, ఇ.కృష్ణ పాల్గొన్నారు.

తాండూరు రూరల్: భారత రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తాండూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జెర్నె నాగప్ప అన్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని చంద్రవంచ, చిట్టిఘనాపూర్, బెల్కటూర్ గ్రామాల్లో జైబాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీబీ ఉపాధ్యక్షుడు ఎస్.రవీందర్‌గౌడ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చౌడాపూర్: పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం చౌడాపూర్ మండలంలోని వీరాపూర్ గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అనే నినాదంతో అభియాన్ రాజ్యాంగ పరిరక్షణ సమావేశం నిర్వహించారు.

సంక్షిప్తంగా..

గావ్ చలో బస్తీ చలో

ఘట్‌కేసర్ రూరల్: పోచారం మున్సిపాలిటీ, కాచవానిసింగారంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన గావ్ చలో బస్తీ చలో కార్యక్రమానికి ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్ పటేల్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు.

పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఘట్‌కేసర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలలో మౌలికసదుపాయాల కల్పనకు స్ట్రీట్ కాస్ స్వచ్ఛందసంస్థ హైదరాబాద్ కృషిచేస్తుందని ఆ సంస్థ ప్రాజెక్ట్ చైర్ విజయ్ తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతమైన పోచారం మున్సిపాలిటీ, కాచవానిసింగారలోని ప్రభుత్వ పాఠశాల మొత్తానికి శుక్రవారం దోమతెరలు పంపిణీ చేశారు.

పూర్వ విద్యార్థుల నూతన కార్యవర్గం ఎన్నిక

కొడంగల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివానంద్‌గౌడ్, ఉపాధ్యక్షురాలిగా శ్వేత, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, నజీర్, కోశాధికారిగా మహేశ్‌కుమార్, సభ్యులుగా నరేశ్, హనుమంతు, రాజు, హరీశ్, సువర్ణ ఎన్నికయ్యారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కులకచర్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పయిపలికు చెందిన వెన్నచేడ్ నర్సింహులు (65) ప్రమాదంలో గాయాలపాలై మృతిచెందగా మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

దోమ: కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్ అన్నారు. మండల క్రియాశీల సభ్యులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులతో శుక్రవారం సమావేశమయ్యారు.

పీహెచ్‌సీలో క్షయవ్యాధి నిర్మూలన శిబిరం

కులకచర్ల: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శుక్రవారం క్షయవ్యాధి నిర్మూలన శిబిరాన్ని నిర్వహించారు. 30మంది రక్త నమూనాలు సేకరించామని వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

దోమ: గుండాల్‌లో ఈ నెల 12 నుంచి 14 వరకు నిర్వహించే శివలింగ, నంది, నవగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, కాలే యాదయ్య, మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డిలను గ్రామస్థులు ఆహ్వానించారు. శుక్రవారం ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీని కలిసి ఆహ్వాన పత్రికలు అందించారు.

సెంట్ మార్క్స్‌లో వైజ్ఞానిక ప్రదర్శనలు

తాండూరు: తాండూరు సెంట్ మార్క్స్ జూబ్లి పాఠశాలలో శుక్రవారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాన్ని పాఠశాల హెచ్ఎం రెవరెండ్ ఫాదర్‌మాదాను జోసెఫ్, తాండూరు ఎంఈవో వెంకటయ్య గౌడ్ ప్రారంభించారు. 8వ తరగతి విద్యార్థిని సెహిరిష్, ఉపద్రితి 'స్మార్ట్ నగరంలో స్థిరమైన అభివృద్ధి' అనే అంశంపై చేసిన ప్రాజెక్టు ఆకట్టుకుంది.

రూ.6.20లక్షలతో మిషన్ భగీరథ పైపులైన్

దుద్యాల: మండలంలోని ఈర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నాన్యనాయక్ తండాలో శుక్రవారం కడా నిధులు రూ.6 లక్షల 20వేలతో మిషన్ భగీరథ పైపులైన్ పనులు చేపట్టారు. తండాలో నూతనంగా నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుకు మెయిన్ లైన్‌ను ఏర్పాటు చేశారు.

ఎస్ఏ-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

పరిగి: ఎస్ఏ-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పరిగి ఎంఈవో గోపాల్ సూచించారు. మండలంలోని నజీరాబాద్‌తండా, రంగాపూర్‌తాండల పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు పూర్తయిన వెంటనే వాటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. శిక్షణ ఫౌండేషన్ వారు అందిస్తున్న ఏమోజీస్ పజిల్ గేమ్‌బాక్స్, టీఎల్ఎం మెటీరియల్‌ను అందజేశారు.

తాండూరులో భద్రేశ్వర స్వామి జాతరపై సమీక్ష

తాండూరు: తాండూరులో జరిగే శ్రీభావిగి భద్రేశ్వర స్వామి జాతరపై శుక్రవారం సబ్‌కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్, పలువురు అధికారులు, ఆలయ కమిటీలతో శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలి

వికారాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం రద్దు చేయాలని ముస్లిం జేఏసీ నాయకులు కోరారు. అల్ ఇండియా ముస్లిం లా బోర్డు పిలుపు మేరకు శుక్రవారం ముస్లిం సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కేంద్రంలో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు.